# మొహమాటం

శర్మ రైలు దిగి అడుగులో అడుగు వేసుకొంటూ, చాలా దీక్షగా ఆలోచిస్తూ ఇంటి వైపుకు నడుస్తున్నాడు.

ఇప్పుడింత మెల్లగా నడుస్తున్నాడు గాని వెళ్ళేటప్పుడు మహాజోరుగా వెళ్ళాడు. శుక్రవారం సాయంత్రం ఆరు గంటల బండికి బయలుదేరి మద్రాసు వెళ్ళాడు. ఒక సినిమా యజమాని అతని చేత పద్యాలు వ్రాయించే విషయంలో మాట్లాడటానికి రమ్మంటే! చాలా సంతోషంగా వెళ్లాడు కూడా.

అతను బయలుదేరిన బండి బెజవాడకు రాత్రి ఎనిమిదింటికి చేరుతుంది. మద్రాసు వెళ్ళవలసిన వాళ్ళు అంతా ఆ బండికే బయలుదేరుతారు.

అల్లాగ వెళ్ళిన వాళ్ళు బెజవాడలో ఎనిమిదింటికి దిగి హోటలులో భోజనం చేసి కాసేపు విశ్రాంతి తీసుకొని పదింటికి మద్రాస్ మెయిల్ ఎక్కుతారు. ఈ బండికి ఆ బండికీ మధ్య రెండు గంటల వ్యవధి ఉంది.

అందుకనే జానకి అతనితో చెప్పిందీ...బెజవాడలో బండి దిగి వెంటనే జట్కా అయినా చేసుకొని మా అక్కయ్య గారింటికెళ్ళి ఇవి ఇయ్యండి...మరిచిపోయి మద్రాసు బండి ఎక్కేరు!

తప్పకుండా ఇయ్యండేం. మద్రాసు నుంచి వచ్చేటప్పుడు దిగి ఇద్దామనుకొనేరు. ఎందుకూ మద్రాసుదాకా ఇవి మోసుకుపోవటం - దారిలో వాళ్లింట్లో పారేసి పొయ్యేదానికి!

మా అక్కయ్య పిల్లలతో చేసుకోలేక ఓ వంద అప్పడాలు ఒత్తి పంపవే అమ్మాయీ అని అడిగింది. చేతులు పడిపోయేలాగున ఒత్తాను. ఎంత జాగ్రత్తగా తీసుకెడతారో ఏమో, తెలిసిందా అంది?"

తెలిసిందని శర్మ తల ఊపాడు.

అయినా జానకికి అనుమానమే. అతనికి తెలిసిందో లేదోనని! అసలు మామూలు

మనిషికి ఉన్న తెలివితేటలు శర్మకు ఉన్నవని ఆ పిల్ల అనుకొని ఉన్నట్లయితే అన్ని సార్లు చెప్పదు. జానకి ఇంకా చెప్పింది.

"చూడండి పై బల్ల మీద పెట్టి దిగేటప్పుడు మరచిపోయేరు"

"స్టేషనులో జనం ఎక్కేటప్పుడు దిగేటప్పుడు సందడిలో ఎవరైనా చేతబట్టుకుపోతారేమో చూస్తుండండి."

"ఆ బుట్టపైన బియ్యపు బస్తాలు పడేస్తారు. దిక్కులు చూస్తూ కూర్చోకండి!"

"ఎప్పుడూ ఆలోచిస్తూ కూర్చోకండి. ఒకటే పరధ్యాన్నం మీకు! ఎవరైనా ఎత్తుకెడుతున్నా ఏమీ తెలియదు మీకు! జాగ్రత్తసుమండీ!"

"బెజవాడలో జాగ్రత్తగా దిగండి. బుట్ట ప్లాట్‌ఫారం మీద ఎవరికైనా అందించి తరువాత మీరు దిగండేం!"

"బుట్ట అందుకొన్న వాణ్ణి కాస్త, ఓ కంటితో చూస్తుండండి – వాడు ఆ పళంగా పట్టుకుపోతాడేమో."

ఇల్లా చెపుతూనే ఉంది జానకి – శర్మ బుట్టా, బెడ్డింగూ జట్కాలో పెట్టుకొన్న తరువాత కూడా జానకి చెపుతున్న మాటలన్నీ జాగ్రత్తగా విన్నాడు.

తెలిసిందా అని మధ్య మధ్య జానకి అడుగుతూ ఉంటే శర్మ తెలిసిందని జవాబులు చెప్పాడు.

తనకు అన్ని సార్లు ఆ విషయాన్ని గురించి చెప్పటం అవసరమేనని శర్మ కూడా అనుకొని ఉంటాడు. లేకపోతే విసుక్కునే వాడేగా! జట్కా కనపడుతూ ఉన్నంతసేపూ జానకి అతని వంకే చూస్తూ నిలబడి, జట్కా మలుపు తిరిగిన తరువాత నిస్పృహలో లోపలికి వెళ్ళిపోయింది.

శర్మ జట్కాలో కూర్చున్నప్పుడు ఆ అప్పడాల బుట్ట వంకే చూస్తూ కూర్చున్నాడు. తన జీవిత సౌఖ్యం అంతా ఆ బుట్టను జాగ్రత్తగా తీసికెళ్ళి, జానకి అక్కగారికి ఇయ్యటం మీద ఆధారపడి ఉందీ....అని శర్మ గ్రహించాడు. బెజవాడలో దిగి అవి ఇచ్చేస్తే, అతనికి సగం భారం తీరిపోతుంది. ఆ తరువాత హాయిగా మద్రాసు ప్రయాణం చేయవచ్చు.

## 2

శర్మ దురదృష్టం అనండి, కర్మం అనండీ, ఏమైంది అంటే, ఆ రోజు రైలు, అంటే బందరు నుంచి బెజవాడ పోతున్న బండి కౌతరం స్టేషనులో ఉండిపోయింది. ఎదురుగా వస్తున్న బండి ఒకటి రైలు పట్టాల మీద నుంచి తొలిగిపోయిందట. కౌతరం స్టేషన్నుంచి పని వాళ్లు వెళ్ళి పట్టాలు బాగు చేసి ఆ రైలును తీసుకొచ్చేసరికి గంటన్నర ఆలస్యం అయింది.

శర్మ బెజవాడ చేరేసరికి మెయిల్ రానే వచ్చింది. ఆ మెయిల్‌కు శర్మ వెళ్ళి తీరాలె. ఈ అప్పడాల బుట్ట సంగతే శర్మకు సమస్య అయిపోయింది. దిగి, గవర్నరు పేటలో ఉన్న వదినగారింట్లో ఇచ్చి వచ్చే వ్యవధి లేదు. ఎవరికైనా ఇచ్చి పంపుదామన్నా ఎరుగున్న వాళ్ళు ఎవ్వరూ కనిపించలేదు.

ఇక ఆలోచించటానికైనా టైము లేదు. శర్మ ఈ బండి దిగి ఆ బండి ఎక్కాడు. అతను కూర్చున్నాడు. బండి కదిలింది. ఇంకేంజేస్తాడూ? ఆ బుట్ట కూడా తనతో మద్రాసు రావలసిందే.

తిరుగు ప్రయాణంలో బెజవాడలో దిగి ఆ బుట్టను వదినగారికి ఇయ్యాలె. అదొక్కటే మార్గం. అంతకంటె ఏం జేస్తాడు?

సోమవారం ప్రొద్దున పది గంటలకు స్కూలుకు అందుకోవాలె. బెజవాడలో దిగటానికి వ్యవధి వుందా? మద్రాసులో ఎప్పుడు ఏ బండికి బయలుదేరితే ఆ పని తను చేయగలుగుతాడు? ఈ ప్రశ్నలన్నీ అతణ్ణి బాధ పెట్టినవి.

మెయిల్ కాస్త ఖాళీగానే వుంది. పై చెక్క మీద పరుపు పరచి రైల్వే గైడు తీసి ఈ ప్రశ్నల కన్నిటికీ సమాధానం కోసం చూశాడు.

శర్మ శనివారం మధ్యాహ్నం మద్రాసు చేరి ఆ సాయంత్రమే ఆ సినిమా ఆయనతో మాట్లాడుతాడు. ఆ రోజు సాయంత్రం మెయిల్ అందదు. ఆదివారం ఎక్స్ప్రెస్ ఎక్కుతాడు. సాయంత్రం నాలుగు గంటలకు బెజవాడ చేరితే ఆ బుట్ట జానకి అక్కకు యిచ్చి ఎనిమిది గంటలకే బందరు బండి ఎక్కుతాడు.

అయితే ఎక్స్ప్రెస్ టైముకు రాకపోవచ్చు. రైలు అన్న తరువాత ఓ గంట

ఇటూ రావచ్చును గదా! అట్లాంటప్పుడు ఆదివారం రాత్రి బెడవాడలో వుండిపోయి తెల్లవారుజామునన నాలుగుగంటల బండి అందుకున్నా సోమవారం స్కూలుకు అందుకోవచ్చు.

ఇంత ఆలోచించి అన్నిటికి అన్ని సరిపోయినవని తోచిన తరువాత శర్మ మనస్సు కాస్త కుదుటపడ్డది. అంతవరకు అతడు ఈ బుట్ట సంగతి ఎట్లాగా అని బెంగ పెట్టుకొన్నాడు.

"ఈ బుట్ట మా అక్కయ్యకు ఇచ్చి మరీ వెళ్ళండి" అని జానకి చెప్పిన మాట శర్మ చెవులలో గింగురుమంటూనే ఉంది. కాని ఏంజేస్తాడు! రైలు ఇల్లాగ మోసగిస్తుందని అతనికేం తెలుసు? "ఇల్లా అయింది దిగి వెళ్ళటానికి టైము లేకపోయింది" అని చెబితే, జానకి మటుకు వినకపోతుందా అని శర్మ తనకు తానే ధైర్యం చెప్పుకొన్నాడు.

తన తప్పు ఏమన్నా ఉందా అని శర్మ చాలా తీవ్రంగా ఆలోచించాడు. అతడు బిఏ పరీక్షకు వెళ్ళినప్పుడు గ్రమేరియన్సు ఫ్యూనరల్ అనే ఖండకావ్యాన్ని అర్థం చేసుకొంటానికి కూడా, ఇంతగా ఆలోచించి ఉండడు.

తెనాలి దాకా ఈ విషయమై ఆలోచించినా ఏమీ తేలలేదు.

అప్పుడు శర్మ అక్కడదిగి, కాస్త కాఫీ పుచ్చుకొని, మళ్ళీ వచ్చి పడుకొని, దిండుపై తలపెట్టి దీపం వంక చూస్తూ మళ్ళీ ఆలోచిస్తే, చివ్వరకు అతనికి ఆకాశవాణి చెప్పినట్లు తోచింది. తన తప్పు ఇందులో కొంచెం కూడా లేదూ అని!

అయితే ఒకటి –

ఇంత అవస్థ తెచ్చి పెట్టుకోకుండా ఉండవలసింది.

"ఈ బుట్ట నేను దీసుకొనిపోను. మీ వాళ్ళు ఎవరైనా వస్తే వాళ్ళ చేతికిచ్చి పంపు" అని చెప్పి చూడాల్సింది.

ఆ అమ్మాయి బుట్టను జాగ్రత్తగా తీసికొని వెళ్ళటాన్ని గురించి అన్ని రకాలుగా చెప్పి "తెలిసిందా" అని అడిగినపుడు "తెలియలేదు" – అని అన్నట్లయితే ఎట్లా ఉండేదో ...అర్థమైందని గంగిరెద్దు లాగ తల ఊపక, అదే అతను చేసిన పొరపాటు. అయిపోయిందేమో అయిపోయింది. ఇప్పుడు అతడు చేయాలిసిన పని ఒకటే. ఆ

బుట్టను జాగ్రత్తగా మద్రాసు తీసికెళ్లి మళ్ళీ జాగ్రత్తగా తీసుకొని వచ్చి ఇయ్యవలసిన చోట ఇచ్చేయటం, ఆ కర్తవ్యం మటుకు శర్మ గట్టిగా గుర్తించాడు. అందుకనే పసిబిడ్డపైన తల్లి చెయ్యి వేసి పడుకున్నట్లు శర్మ ఆ బుట్టపైన చెయ్యి వేసి పడుకున్నాడు.

మద్రాసులో దిగి శర్మ, బుట్టా, బెడ్డింగూ, తీసుకొని శాస్త్రి ఇంటికి వెళ్ళాడు. శాస్త్రి ఇంటికి వెళ్ళటానికి రెండు బలమైన కారణాలున్నవి. హొటలులో ఈ రెండూ పడేసి తాము ఊళ్లోకి వెడితే హొటల్లో ఎవరైనా ఆ బుట్టలో నుంచి అప్పడాలు కొన్ని తీస్తే తీయవచ్చు. లేకపోతే, ఎవరైనా ఎత్తుకొని పోయినా పోవచ్చు! అంత విలువైన వస్తువును పది మంది వచ్చి పోయ్యే హొటల్లో పెట్టడం మంచిది కాదు. శాస్త్రి బాల్య స్నేహితుడు, అక్కడయితే సురక్షితంగా ఉంటుంది. అదీకాక హొటలులో బస చేస్తే రోజుకు అయిదు రూపాయలు అనవసరమైన ఖర్చు. శర్మ అందుకనే శాస్త్రి ఇంటికి వెళ్ళాడు.

శాస్త్రి శర్మ చాలా దగ్గర స్నేహితులు. చిన్నప్పుడు చదువుకొన్నారు కూడాను. శర్మ శాస్త్రితోనేగాక, శాస్త్రి భార్యతో కూడా చాలా చనువుగా ఉంటాడు. ఆ అమ్మాయి "అన్నయ్య అన్నయ్య" అంటూ శర్మను ఎంతో ప్రేమగా చూస్తుంది. ఎంతో ఆలోచించి, అక్కడికి వెళ్ళటమే అన్ని విధాల మంచిదని వెనకా ముందూ ఆలోచించే చేస్తాడు.

శర్మను చూచి ఆ పిల్ల చాలా సంతోషంతో "అన్నయ్య వచ్చాడండి!" అంటూ భర్తతో చెప్పింది. శాస్త్రి కూడా చాలా సంతోషించి శర్మను వెంటనే స్నానం చేసి భోజనానికి రమ్మని త్వరపెట్టాడు.

స్నానం అయిపోయింది. స్నేహితులు ఇద్దరూ భోజనానికి కూర్చున్నారు. ఇంతలో ఆ అమ్మాయి "ఏమండోయ్!" అని పెద్దగా అరచి పకపక నవ్వటం సాగించింది.

ఏమిటా అని ఇద్దరూ చూస్తుండగానే ఆ అమ్మాయి "నేనింకా చూడనేలేదు. తెలివితక్కువ దాన్ని. చూశారా అన్నయ్య అప్పడాలు తెచ్చారండీ మనకు. చెప్పవేం అన్నయ్యా" అంటూ పసిపిల్ల నెత్తుకున్నట్లు ఆ బుట్టనెత్తుకొచ్చి శాస్త్రికి చూపింది. శాస్త్రి సంతోషించి "శర్మ సంగతి నేను చిన్నప్పటి నుంచీ ఎరుగుదును. మహా ఆర్భాటంగా చెప్పే మనిషి కాదు" అన్నాడు. శర్మ నవ్వి ఏం చెపుదామా అని ఆలోచిస్తున్నాడు. ఇంతలో శాస్త్రి పెళ్ళాంతో "ఓసీ తెలివి తక్కువ మొద్దా, అవి ముందు పెట్టుకొని

కూర్చోకు. ఎవరైనా వచ్చారా అంటే గద్ద తన్నుకపోయినట్లు తన్నుకపోతారు" – అన్నాడు.

ఆ అమ్మాయి ముసిముసి నవ్వులు నవ్వుకొంటూ అప్పడాలు ఒక్కొక్కటే తీసి లెక్క పెడుతున్నది.

ఇలాగ అప్పడాలన్నీ ముందెట్టుకొని కూర్చోడం శాస్త్రికి ఏ మాత్రమూ యిష్టంలే. "మన తెలుగువాళ్ళు అయిదారు కుటుంబాలవాళ్ళు వున్నారు. ఈ ప్రాంతంలో వాళ్ళందరూ మన ఇంటికి ఎప్పుడూ వస్తూనే వుంటారు. ఈ అప్పడాలు చూస్తే ఇక బ్రతకనిస్తారా, తలా ఒకటి పట్టుకెళితే అయిపాయె! ఎట్లా వద్దంటాము – ఏమంటావు" అన్నాడు శాస్త్రి శర్మవైపు తిరిగి, ఆ సంగతి నిజమేనని శర్మ ఒప్పుకొన్నాడు.

ఈ లోపున ఆ అమ్మాయి ఆ వందా లెక్కపెట్టి ఇంత మొఖం చేసుకొని సంతోషంతో – "వంద వున్నాయండీ మనకు మూడు నెలలొస్తాయి" అన్నది.

శాస్త్రి ఆ అమ్మాయి వంక చిరాకుగా చూస్తూ – ' అవునుగాని ఇప్పుడైనా అవి ఎక్కడైనా కనపడని చోట జాగ్రత్త చెయ్యి" అన్నాడు. ఆ అమ్మాయి ఆ బుట్టా బుట్టా తీసికెళ్ళి కొయ్య పెట్టెలో పెట్టి తాళం వేసింది.

ఆ అమ్మాయి ఎంతో సంతోషించటం చూచి శాస్త్రి "ఏమిటా సంతోషం పట్టలేకుండా ఉన్నావు! తెచ్చాడులే మీ అన్నయ్య వెటకారంగా! అన్నాడు. "అవునండి సంతోషం అంటే సంతోషం కాదూ, మా అన్నయ్యే తెచ్చాడు, నిజమే! మీ వాళ్ళు ఎప్పుడైనా తెచ్చారా?" అని నిలదీసి అడిగింది ఆ పిల్ల. దాని తరువాత కాస్సేపు శాస్త్రి, శాస్త్రి పెళ్ళామూ సరదాగా పోట్లాడుకొన్నారు. చివరకు శాస్త్రి అన్న మాట ఏమిటీ అంటే, సరేకాని, మా అన్నయ్య అప్పడాలు తెచ్చాడని, ఎగిరి, అందరికీ చెప్పబోకు పీక్కు తింటారు" అన్నాడు – ఆ పిల్ల ఎవ్వరితోను చెప్పకుండా ఉంటానికి ఒప్పుకొన్నది.

"ఇక్కడ దొరికే వస్తువులు కావోయి ఇవి. పాపం మీ చెల్లెలు ఈ అప్పడాలంటే చెవికోసుకొంటుంది" అన్నాడు శాస్త్రి.

"అబ్బ! మీరు మటుకు! ఈ మద్రాసు అప్పడాలు రుచీ పచీ లేవు వెధవవి, మన అప్పడాలు దొరికితే బాగుండునని ఎన్ని సార్లు అన్నారు" అన్నది ఆ అమ్మాయి.

"అయితే ఏం, నా కోసం తెచ్చాడా ఇవి? చెల్లెలు పాపం మద్రాసులో కాపరం

చేస్తున్నదని నీ కోసం తెచ్చాడు కాని!" – అని వరసలలోకి సరసాలలోకి దించాడు, సంభాషణను శాస్త్రి. ఆ తరువాత ఆ అప్పడాలు ఎవరి కోసం తెచ్చాడూ అన్న విషయంపై భార్యాభర్తలు ఇద్దరూ కాసేపు వాదించుకొని, చివరకు శర్మనే అడిగారు – "నిజం చెప్పు నీవు ఎవరి కోసం తెచ్చావు?" అని.

శర్మ ఉక్కిరిబిక్కిరి అయి తెప్పరిల్లి, మర్యాద కోసం, "నీ కోసమే తెచ్చానమ్మా శాస్త్రికెందుకూ, వాడు ఎక్కడబడితే అక్కడ ఏదిబడితే అది తింటాడు" అని సరసం ఆడాడు. అంతా నవ్వుకొన్నారు.

శర్మ నవ్వుతున్నాడని ఆ అమ్మాయీ, శాస్త్రి అనుకొన్నారు కాని అతని గుండెలు ఎంత వేగంగా కొట్టుకుంటున్నాయో, వాళ్ళు గ్రహించలేదు – ఎట్లాగయితేనేం శర్మకు అప్పడాలు ఒదిలిపోయాయి.

## 3

శర్మ శీలాన్ని విమర్శించి మంచివాడనో, తెలివితక్కువ వాడనో, మోమాటం కలవాడనో, గుణవంతుడనో, దద్దమ్మ అనో, ఏదో విధంగా నిర్ణయం చేయవలసిన సమయం ఇది.

"ఆ అప్పడాలు మనవి కావు అమ్మాయి, మా వదిన గారికి ఇమ్మని మా ఆవిడ ఇచ్చింది. ఇయ్యకపోతే మెడకాయ పిసుకుతుంది" అని ఒక్క మాట అంటే, ఆ పిల్ల శర్మను చంపేదా! అనలేకపోయినాడు శర్మ.

సినిమా యజమానితో మాట్లాడి అనుకొన్నట్లుగానే ఆదివారం రాత్రికల్లా బెడవాడ చేరాడు – పాపం, ఊళ్ళోకి వెళ్ళాల్సిన అవసరం లేకపోయింది. శర్మ గవర్నరు పేట వైపు బిక్కచూపులు చూచి, ఆ రాత్రి స్టేషనులో గడిపి ప్రొద్దున బండిలో ప్రయాణం చేసి బందరు చేరాడు.

గుమ్మంలో కాలుపెట్టడంతోటే ఆ అమ్మాయి ముందు అడిగే ప్రశ్న అది – అక్కయ్యకు అప్పడాలు ఇచ్చారా అని! ఈ ప్రశ్నకు ఏం జవాబు చెపుదాము అని అయినా శర్మ ఆలోచించుకోలేదు. మద్రాసు నుంచి విచారంగా వచ్చాడు. అడగబోయే ప్రశ్నా, దానికి జవాబూ అనుకొని ఉంచుకోడూ! అయోమయం మనిషి!

శర్మ మెల్లగా నడుస్తున్నాడు. మెల్లిగా నడిస్తే ఉపాయం తోస్తుందీ! దారిలోనే అనుకోవాలిసింది, గొప్ప గొప్ప మొగుళ్ళు అంతా ఇంటికి వచ్చే ముందు ఒకసారి నిలబడి ఇంటికి వెళ్ళటంతోనే ఆవిడ ఈ ప్రశ్న అడుగుతుంది, దానికి జవాబు ఇల్లాగ చెబుదాము, అని కూడబలుక్కుని గాని గడపతొక్కరు కదా, ఇదెక్కడి పిచ్చి మొత్తుకోళ్ళో ఏ ఆలోచనా లేకుండా చూస్తాడేం శర్మ!

ఎంతసేపు ఆలోచించినా అతనికి ఏమీ తోచలేదు. సరే ఏమన్నాకానీమని లోపలకు వెళ్లాడు. ఆ పిల్ల ఎదురుగా వచ్చి చిరునవ్వుతో ఆహ్వానించి, ఈ "బండికే వచ్చారా? నిన్న అర్ధరాత్రి బండికి వస్తారనుకున్నాను!" అన్నది.

శర్మ నవ్వుతూ బెడ్డింగు కూలి వాడి నెత్తి మీద నుంచి దింపుకొని, కోటూ, చొక్కా విడుస్తున్నాడు. ఆ ప్రశ్న ఎప్పుడు వస్తుందోనని అతని గుండె దడదడలాడుతునే ఉంది. నాలుగు మెతుకులు నోట్లో వేసుకొని బైటపడ్డాడా, ఇక సాయంత్రం దాకా కనపడడు కదా, దాని తరువాత చూచుకోవచ్చు.

ఈ కాసేపు ఆ అమ్మాయిని మాటలలో పెట్టి నవ్వించే నేర్పు అయినా ఉంటే బాగుండును శర్మకు బ్రతికిపోయేవాడు. నాలుగుసార్లు ఆ పిల్లను చూచి నవ్వాడు!

నవ్వించటానికి అదే మార్గం అనుకొన్నాడు. ఇంకో మార్గం తెలియక. శర్మకు పోట్లాడటం తెలిసినంత బాగా మాట్లాడటం తెలియదు. ఎంత నవ్వినా గుండెల్లో గుబుల్ గుబుల్ అంటునే ఉంది పాపం శర్మకు.

జానకి మాట్లాడటం మొదలుపెట్టే అప్పటికి శర్మ గుండెలు కొట్టుకునేవి – ఆ మాటల సందర్భంలో ఆ ప్రశ్న ఎక్కడ వస్తుందో అని. అందుకే అతడు ముళ్ళ మీద కూర్చున్నట్లు కూర్చుని మాటాడకుండా భోజనం చేస్తున్నది.

జానకి ఇంతసేపు ఆ ప్రశ్న వేయకపోవడము కూడా చిత్రంగానే వుంది. ఊరుకొనే మనిషి కాదు మరి. ఎందుకు వూరుకుందో ఏమిటోనని శర్మ మరీ భయపడ్డాడు.

"మీరు వెళ్ళిన రైలు కౌతరంలో పడిపోయిందటగా" అని అడిగింది జానకి.

ఎంతసేపటికి శర్మ మాట్లడకపోవడం చూచి – పడిపోవడం కాదు, గంటన్నర ఆలస్యముగా బెజవాడ చేరింది. వెంటనే మెయిల్ ఎక్కాను. మీ వాళ్ళ ఇంటికి వెళ్ళి

వచ్చే వ్యవధి లేకపోయింది" – అన్నాడు శర్మ.

జానకి ఆ శేషప్రశ్న అడక్కపోవడం కూడా కష్టంగానే ఉంది. ఏదో అది కాస్తా తేలిపోవాలనే అతను తొందర పడ్డాడని నేను అనుకొంటాను.

అప్పటికీ ఆ అమ్మాయి ఆ ప్రశ్న అడక్క "అవును లెండి ఆ సంగతి తెలుస్తూనే వుంది అయితే ఆ అప్పడాలు మద్రాసు తీసికెళ్ళారా?" అని అడిగింది. శర్మ దీనంగా చూస్తూ "మరేంజేసేది తీసికెళ్ళాను" అన్నాడు.

జానకి విరగబడి నవ్వి "అయ్యో ఆ బుట్టేసుకొని మద్రాసు పోయినారుటండీ! ఆ బుట్టా మీరూనూ!! అందరూ నవ్వలేదూ మీ వాలకం జూచి! ఆ తాటాకు బుట్టా మీరూనూ!" అన్నది.

(1964)